# కానుక

## కె. సరోజ

"అదిగో అల్లదిగో శ్రీహరి వాసమూ
పదివేల శేషుల పడగల మయమూ"

శోభారాజు స్వరం మధురంగా వినబడుతోంది టేప్ రికార్డర్‌లో. ఈ అన్నమాచార్య కీర్తన కనీసం ఐదు వందలసార్లైనా విని వుంటాడు తను. చివరికి మిగిలిందదేగా!

బరువుగా నిట్టూర్చాడు సలీమ్.

"... కైవల్య పదము ... ..." హఠాత్తుగా ఠక్ మనే శబ్దంతో టేప్ రికార్డర్ ఆగిపోయింది.

"బీబీ టేప్ ఆగిపోయిందేం!" భార్యని పిలిచి అడిగాడు సలీమ్.

"నేనే ఆపేశాను. అసలే తెలుగు పాటలంటే ఒళ్ళుమంట నాకు. పైగా స్నేహితులు కూడా వచ్చారు. హిందీ పాటలు పెడ్దామనుకున్నా."

"ఏం వాళ్ళక్కూడా అసహ్యమా?"

"ఏడ్చినట్లే వున్నాయి పాటలు! ఇంకా వాళ్ళు కూడా వినాలా!" విసురుగా సమాధానం చెప్పింది సుల్తానా.

"చూడు సుల్తానా, నాకా అనారోగ్యం. అందులోనూ ఈ చలి, అదొక్కటే కాదు ... విపరీతమైన గాలి. ఈ వేళ స్నో స్టార్మ్ కూడా వచ్చేట్లుంది. అసలే ఉబ్బసం. పైగా ఈ వయస్సులో స్నోలో జారిపడితే యింకేమైనా వుందా! అప్పుడింకా విసుక్కుంటావ్ నువ్వు. నీ కెప్పుడూ మహిళా సంఘాలూ - సాంఘిక పునరుద్ధరణా ... వీటితో తీరికే లేదు. యేభయ్యో పడిలో ఇంత చురుగ్గా నువ్వున్నందుకు నాకేం అసూయ లేదు. అది నీ అదృష్టం. కానీ నేను అదృష్టహీనుణ్ణి. ప్రపంచంలో ఎక్కడ ఏది వచ్చినా ముందు నాకే దాపురిస్తుంది ..."


ఇంకా ఏదో అనబోయాడు సలీమ్.

"ఖర్మ ... ఖర్మ ... బుద్ధి గడ్డితిని వీళ్ళ నీవేళ లంచ్‌కి పిల్చాను. ఇప్పుడు మేం బయటికి వెళ్ళి తింటాం. పదండ్రా చిచిన్‌కి వెళ్దాం!" ఎర్రబడ్డ కళ్ళతో కోపంగా బయటికి వెళ్ళిపోయింది సుల్తానా.

'రక్షించావ్‌లే' అనుకున్నాడు సలీమ్.

'ఆ వెళ్ళేది కనీసం టేప్ ఆన్‌చేసి వెళ్ళకూడదూ! ఊహూ ఎందుకు చేస్తుంది!" ఆయాసపడుతూ లేచి టేప్ ఆన్‌చేసుకుని తిరిగి శోభారాజు పాటలో లీనమై పోయాడు.

* * *



'సలీమ్ మహమ్మదీయ కుటుంబానికి చెందినవాడే అయినా అతను పుట్టి పెరిగింది, చదువుకుంది అంతా గుంటూర్లోనే. అతని తండ్రి ఇస్మాయిల్ తాలూకా ఆఫీస్‌లో ఉద్యోగం చేస్తూనే తెలుగులో చక్కటి కవిత్వం వ్రాస్తుండేవాడు. ఆయన రిటైరయ్యాక ముత్యాల రాజా వారి ఆస్థాన పండితుడుగా కూడా వుండేవాడు. వారి కుటుంబం హిందూ-మహమ్మదీయ సాంప్రదాయానికి దర్పణంలా వుండేదా కాలంలో. అన్ని మతాల సారం ఒక్కటే అని 'దిన్-ఇలాహి' ని అక్బర్ ప్రవేశపెట్టినట్లు తెలుగు, ఉర్దూల సారమొక్కటే అని తనొక గ్రంథాన్ని వ్రాయాలని ఊహాగానం చేసేవాడు ఇస్మాయిల్. కానీ ఆయన కోరిక కోరికగానే మిగిలిపోయింది. సలీమ్‌కి రచనా శక్తి ఉన్నప్పటికీ అతనెప్పుడూ దాన్ని వినియోగించుకోలేదు. కానీ తెలుగు సాహిత్యం కొట్టిన పిండి అతనికి. తండ్రి పోయాక సలీమ్‌కి కుటుంబ బాధ్యత తప్పలేదు. తల్లి కోర్కె మీద దగ్గరి బంధువైన సుల్తానాను పెళ్ళాడాడు. ఆమె తండ్రి ఆర్థికంగా ఆదుకోవడం మూలంగా కొంత ఊపిరి తీసుకున్నాడు. త్వరలోనే చెల్లెళ్ళిద్దరూ, తమ్ముళ్ళు ముగ్గురూ స్థిర పడ్డారు.

సుల్తానా అందగత్తె.

చదువుంది కానీ సంస్కారం సున్న. మూర్ఖత్వం పాలు కూడా అధికం. తన అందాన్ని, చదువునీ ఎరగా వేసి భర్తని పూర్తిగా తన చెప్పుచేతల్లో వుంచేసుకుంది. ఆమెకు ఫారిన్ వ్యామోహం కూడా ఎక్కువే.




*జూన్ 9న విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 40వ వార్షికోత్సవాలు జరిగిన సందర్భంగా వివిధ రకాలైన అవధాన కళలు ప్రదర్శించి ప్రేక్షకులను అలరించిన స్థానిక శారదా పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు. వేదికపై ఆసీనులైనవారు 'అవధాన శేఖర' శ్రీ డి., కోటేశ్వర శర్మ, ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు, కార్యదర్శి .*

అందుకే ... ఇంజనీర్‌గా పని చేస్తున్న భర్తచేత కెనడాకు అప్లై చేయించింది. అప్పట్లో ఇమ్మిగ్రేషన్ కావాలంటే ... తాంబూలం ఇచ్చి మరీ ఇస్తుండడంవల్ల కెనడా రావడం, ఉద్యోగంలో స్థిరపడడం జరిగాయి. కొడుకులు అమీర్, అజీజ్‌లు పుట్టడం ఆ వెంటనే జరిగి పోయాయి. అలా ముప్పై ఏళ్ల ఎండ వచ్చినప్పటి ఐసుముక్కల్లా కరిగిపోయాయి.

సలీమ్ కొడుకులిద్దరూ జీవితాల్లోనూ - ఉద్యోగాల్లోనూ స్థిరపడ్డారు. సుల్తానాకు కెనడియన్ల జీవన విధానమంటే మహా మోజు. ఆమె పిల్లలిద్దర్నీ అలాగే పెంచి, పదహారేళ్ళు నిండీ నిండకముందే ఇంటి నుంచి తరిమేసింది. వాళ్ళు ఫాదర్స్ డే రోజున, మదర్స్ డే రోజున వచ్చి - ఏవో బహుమతులిచ్చి, కౌగలించుకుని ప్రేమ వుందో లేదో అని ఆలోచించే వ్యవధి లేకుండా ముద్దులు పెట్టుకుని వెడుతుంటారు. సుల్తానా సరేసరి ... పట్టుమని పది నిమిషాలు కూడా ఇంటిపట్టున వుండదు.

ఐదారేళ్ళ నుంచీ సలీమ్‌కు ఏమాత్రం ఓపికుండడం లేదు. అందుకే ముందుగానే రిటైరైపోయాడు. కరవులో అధిక మాసం అన్నట్లు వున్న ఉబ్బసానికి తోడు స్వల్పంగా గుండెపోటు కూడా వచ్చిందిటీమధ్య. అసలే అతనికి తెలుగు భాషంటే వెర్రి అభిమానం. అతనిప్పుడున్న పరిస్థితుల్లో అతనికి కావల్సింది తెలుగు మాట్లాడే తెలుగువాళ్ళు, ఆప్యాయతను పంచియిచ్చే వ్యక్తులు. సుల్తానాకు మహమ్మదీయ మతం అంటే ఎనలేని భక్తి. కెనడా వచ్చాక తెలుగు మాట్లాడమని అడిగితే చాలు తారాజువ్వలా ఎగిరిపడేది. నూనగా ఆమెతో మాటలు తగ్గించాడు సలీమ్. ఏకాంతమే ఇప్పుడతని ఏకైక నేస్తం. మౌనమే అతనికి వూరట.

'ఈ దేశంలో ఎవర్ని పలకరించినా 'బిజీ' అనే జవాబు. పుస్తకాలు చదివే ఓపిక కూడా లేదు. ఇండియా వెళ్ళి గుంటూరు-విజయవాడ రోడ్లు తిరిగితే తన రోగం కుదుట పడుతుందేమో! కానీ, ఈ వయస్సులో తనకెవరు సేవలు చేస్తారు!' అనుకుంటూ మథనపడుతూ మానసికంగా ఏమాత్రం విశ్రాంతి పొందలేకపోతున్నాడు సలీమ్.

*　　*　　*

చలి రాకాసి కర్కశ పాదాల కింద నలిగిపోయాయి మరో నాలుగు సంవత్సరాలు.

ఈ నాలుగేళ్ళ కాలం సలీమ్ దేహానికి ఇరవై ఏళ్ళనూ, మనస్సుకు యాభై ఏళ్ళనూ అధికంగా అందించింది.

ఆ రోజు సలీమ్ అరవయ్యవ పుట్టిన రోజు. గతంలో ఎన్నడూ లేనిది అతని భార్యా, కొడుకులూ, కోడళ్ళూ, పిల్లలూ అందరూ ఎంతో అట్టహాసంచేసి సలీమ్‌ని ఆశ్చర్యంలో ముంచెత్తారు.

"పుట్టిన రోజు శుభాకాంక్షలు అంకుల్" సౌమ్యంగా, అభిమానంగా అన్నాడు నిరంజన్. తియ్యని తెలుగు పదోచ్చారణకు తబ్బిబ్బైన సలీమ్ ముఖం వేయివాట్ల బల్బులా వెలిగింది.

"నువ్వు ... నువ్వు ... నిరంజన్ ... ఇంత కాలానికి వచ్చావా ..." వాత్సల్యంగా అతని తల నిమిరాడు సలీమ్.

"అవును అంకుల్. యూనివర్సిటీలో సవెక్కువగా వుండడంవల్ల మిమ్మల్ని కల్సుకోలేకపోతున్నాను. అది సరేకాని అంకుల్ మీ పుట్టిన రోజు సందర్భంగా మీకో చిన్న విలువైన కానుక, ఒక్క నిమిషం ..." అంటూ మేడ మీదకి వెళ్ళి తన తండ్రి రాజారావ్‌ని వెంట తీసుకువచ్చాడు నిరంజన్. తన కళ్ళను తాను నమ్మలేక పోయాడు సలీమ్.

పరిసరాలను విస్మరించి ఆ ఆప్తమిత్రులు ఒకరి కౌగిలిలో మరొకరు అలా ఎంతసేపైనా వుండిపోయే వారేమో కానీ ...

"కేక్ కట్ చేయండి డాడీ" అన్న కొడుకు పిలుపుతో వాస్తవంలోకి వచ్చాడు సలీమ్.

పార్టీ ముగిశాక చెప్పాడు నిరంజన్.

"నాన్నగారక్కడ ఒంటరివారు.

అందరూ వున్నా ఒంటరివారు మీరిక్కడ! మీరిద్దరూ ఇక్కడ కానీ, నాదగ్గర కానీ, లేక వేరే అపార్ట్‌మెంట్‌లో కానీ, మీ కెక్కడ సౌకర్యంగా, సంతోషంగా వుంటుందనుకుంటే అక్కడే వుండవచ్చు. అది మీ ఇష్టం. మీకేం కావాలన్నా నేనున్నాను. నా డాక్టర్ స్నేహితుడు రోజూ వచ్చి మిమ్మల్నిద్దర్నీ చూసి వెడతాడికనుంచీ. ముందే నేనివన్నీ ఆలోచించి మీ షష్టిపూర్తికి మీకు ఆహ్లాదాన్నిచ్చే కానుక ఇవ్వాలని నాన్నగార్నిక్కడకు రప్పించాను" తను చెప్పవలసిందయిపోయిందన్నట్లు చిరునవ్వు నవ్వాడు నిరంజన్.

సుల్తానా కల్పించుకుని, "ఇక్కడే వుండవచ్చు రాజారావ్‌గారు కూడా" అంది.

అది ఎవర్ని ఉద్దేశించి ఆమె అన్నదో కానీ ... ఎవరూ ఆ విషయం పట్టించుకోలేదు.

"నాన్నగారూ! ఆలోచించుకుని ఫోను చేయండి" అంటూ వింటర్ కోట్ వేసుకోసాగాడు నిరంజన్. అప్పటికే బై బై డాడీ అంటూ వెళ్ళిపోయారు సలీమ్ కొడుకులు.

"నాకూ మీటింగ్ వుంది" హడావుడిగా ... కోటూ, బూట్లూ వేసుకుని కారు గెరాజ్‌వైపు నడిచింది సుల్తానా. కొడుకుద్వారా విషయాలన్నీ తెల్సిన రాజారావ్ ఏ మాత్రం విస్తుపోలేదు.

"ఒరే సలీమ్!"

"ఏరా రాజా!"

ఇద్దరి కళ్ళల్లో ఆనంద బాష్పాలు.

"ఒరే సలీమ్ నీ వీణ వాయించరా, నా మృదంగం తెచ్చాను" అంటూ ఫామిలీ రూమ్‌లోకి వెళ్ళి తన మృదంగం తెచ్చాడు రాజారావ్.

సలీమ్‌కి ఆయాసంగా వున్నా, కొండంత బలం వచ్చినట్లనిపించి వీణ బయటికి తీసి సుతారంగా దుమ్ము దులిపి ... శృతి చేసుకున్నాడు.

ఆ ఇద్దరు మిత్రులూ తమ కలయికను వీణ, మృదంగాల సమ్మేళనంగా మార్చి గణపతిని స్మరించసాగారు.

